నమస్తే తెలంగాణ
సూర్యాపేట
5 | నల్లగొండ, గురువారం 19 సెప్టెంబర్ 2024 | SURYAPET

గోదావరి జలాలు విడుదల

వెలిశాల – 69 డీబీఎం వద్ద ప్రవహిస్తున్న గోదావరి జలాలు

తిరుమలగిరి, సెప్టెంబర్ 18 : జనగాం జిల్లా బయ్యన్నవాగు రిజర్వాయర్ నుంచి నీటి పారుదల శాఖ అధికారులతో కలిసి ఎమ్మెల్యే మందుల సామేల్ బుధవారం సాయంత్రం గోదావరి జలాలను విడుదల చేశారు. కాళేశ్వరం జలాలు మండలంలోని వెలిశాల వద్ద డీబీఎం69 నుంచి జిల్లాకు చేరాయి. దిగువ నుంచి ఎగువకు నీరు విడుదల చేయడంతో జిల్లావ్యాప్తంగా సుమారు 650 చెరువులు, కుంటలు జలకళను సంతరించుకోనున్నాయి. కాగా డీబీఎం-69, 70, 71 కాల్వలకు 1500 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తామన్నారు. తొలుత 500 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తూ దశలవారీగా పెంచుతామని తెలిపారు.

తొమ్మిది నెలల్లో.. నయాపైసా రాలె!

సూర్యాపేట, తుంగుతుర్తి నియోజకవర్గాలపై చిన్నచూపు

అభివృద్ధి పరుగులు పెట్టిన చోట సమస్యల తిష్ఠ

పాత బిల్లుల చెల్లింపుల్లేవు.. కొత్తగా నిధుల మంజూరు లేదు

సగం జిల్లాకే మంత్రి ఉత్తమ్ పరిమితం! కనీసం రివ్యూలూ పట్టని వైనం

బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నెలనెలా పట్టణ ప్రగతి నిధులతోపాటు గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి మంత్రిగా ఉన్న సమయంలో జిల్లాలోని ఐదు మున్సిపాలిటీలకు నిధుల వరద పారింది. కేసీఆర్ సర్కారు ఉన్న తొమ్మిదిన్న రేండ్లలో జిల్లాలోని మున్సిపాలిటీలకు దాదాపు 50వేల కోట్లు నిధులు వచ్చాయి. ప్రస్తుతం కాంగ్రెస్ పాలనలో మాత్రం వేతనాలు, విద్యుత్ బిల్లులు, వాహనాల డీజిల్‌కే కష్టమవుతున్నది. గత తొమ్మిది నెలల్లో సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీలకు నయాపైసా నిధులు విడుదల కాకపోవడం గమనార్హం. ఇప్పటి వరకు జిల్లా కేంద్రానికి వచ్చి అన్ని శాఖలతో ఒక్క రివ్యూ కూడా పెట్టని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్న హుజూర్‌నగర్, ఆయన సతీమణి పద్మావతి ఎమ్మెల్యేగా కోదాడ నియోజకవర్గాలకు మాత్రమే మంత్రిగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలకు కోట్లాది రూపాయలు ఇస్తుండగా సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీలను కనీసం పట్టించుకోవడం లేదు.

– సూర్యాపేట, సెప్టెంబర్ 18 (నమస్తే తెలంగాణ)

తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావం అనంతరం బీఆర్ఎస్ హయాంలో మంత్రి జగదీశ్‌రెడ్డి అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌తోపాటు వివిధ శాఖల మంత్రులను సూర్యాపేటకు తీసుకువచ్చి మున్సిపాలిటీ కోట్ల రూపాయల నిధులు రప్పించారు. జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలకూ ప్రాధాన్యమిస్తూ రోడ్లు, డ్రెయినేజీలు, సెంట్రల్ లైటింగ్, సుందరీకరణతోపాటు మౌలిక సదుపాయల కల్పనకు కృషి చేశారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంలో నిధుల విడుదల పట్ల పక్షపాత ధోరణి స్పష్టంగా కనిపిస్తున్నది. కోదాడ, హుజూర్‌నగర్, నేరేడుచర్ల మున్సిపాలిటీలకు నిధులు తీసుకువస్తున్న జిల్లా మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీలను మాత్రం పట్టించుకోవడం లేదు.

చేసిన పనులకూ బిల్లుల్లేవ్..

సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీల్లో గతంలో చేసిన పనులకు సంబంధించిన బిల్లులు కూడా గత తొమ్మిది నెలల్లో ఒక్కటీ విడుదల కాలేదు. కొత్త పనుల మంజూరు అసలే లేదు బీఆర్ఎస్ ప్రభుత్వంలో సూర్యాపేటకు టీయూఎఫ్ఐడీసీ కింద రూ.30 కోట్లు, ఎస్‌డీఎఫ్ కింద 50 కోట్లు మంజూరు చేయించి టెండర్లు ద్వారా వర్క్ ఆర్డర్లు ఇప్పించి కొన్ని పనులు చేయించగా ఆ పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు నేటికీ ఒక్క రూపాయీ మంజూరు కాలేదు. ఎన్నికల కోడ్ వల్ల కొన్ని వార్డుల్లో ఎస్‌డీఎఫ్ నిధులు రూ.50 కోట్లలో 2.93 కోట్ల పనులు మాత్రమే చేయగా, ఆ మొత్తం కూడా చెల్లించలేదు. టీయూఎఫ్ఐడీసీ నిధులు రూ.30 కోట్ల పనులను పర్యవేక్షిస్తున్న పబ్లిక్ హెల్త్ డిపార్ట్‌మెంట్ చేసిన రూ.15 కోట్ల పనులకు బిల్లులు రెడీ చేసి ప్రభుత్వానికి పంపించినా మంజూరు కాలేదు. మిగిలిన రూ.15 కోట్ల పనులకు వర్క్ ఆర్డర్లు ఇచ్చి అగ్రిమెంట్ చేసుకోగా తదుపరి ఉత్తర్వుల కోసం వేచి చూస్తున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక నియోజకవర్గానికి రూ.10 కోట్లు ఎస్‌డీఎఫ్ కింద మంజూరు చేయగా, ఆ నిధుల నుంచి రూ.3.30 కోట్లను 31 వార్డులకు కేటాయించి కాంట్రాక్టర్లకు వర్క్ ఆర్డర్లు ఇచ్చి అగ్రిమెంట్ చేశారు. గతంలో చేసిన పనులకు సంబంధించిన నిధులే రావడం లేదని ఇక కొత్తవి ఏం ఇస్తారోనన్న భయానికి కాంట్రాక్టర్లు కూడా పనులు చేయడం లేదు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో సూర్యాపేటకు పట్టణ ప్రగతి నిధులు కింద నెలనెలా రూ.46 లక్షలు మంజూరు అయ్యేవి.. కాంగ్రెస్ సర్కారులో ఒక్క నెల కూడా నిధులు విడుదల కాకపోవడంతో పనులు చేసిన కాంట్రాక్టర్లకు చెల్లించాల్సిన సుమారు రూ.6 కోట్ల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయి.

వేతనాలకే ఇబ్బందులు..

అభివృద్ధి పనులకు కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయకపోవడంతో ప్రధానంగా సూర్యాపేట, తిరుమలగిరి మున్సిపాలిటీల్లో సిబ్బంది జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు వంటి అవసరాలకు సైతం ఇబ్బందులు పడాల్సి వస్తున్నది. ఇంటి పన్ను, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్‌లు, బిల్డింగ్ పర్మిషన్ ఫీజుల వంటి నిధుల నుంచి వచ్చే ఆదాయం సిబ్బంది వేతనాలు, నీటి సరఫరా, ఎలక్ట్రికల్, పారిశుధ్య నిర్వహణకే సరిపోవడం లేదు. ఈ నిధుల్లో కూడా బిల్డింగ్ పర్మిషన్ ఫీజు, లే అవుట్ ఫీజు, ట్రేడ్ లైసెన్స్ ఫీజు గతంలో మున్సిపల్ అకౌంట్లలో జమ అయ్యేవి. ప్రస్తుతం టౌన్ ప్లానింగ్ హెడ్ ఆఫీస్ అకౌంట్‌లో నేరుగా జమవుతున్నాయి. దాంతో మున్సిపాలిటీల ఆదాయానికి గండి పడింది. జమ అయిన అమౌంట్ ఎంత, మున్సిపాలిటీలకు ఇచ్చేది ఎంత అనే దానిపై లెక్కాపత్రం లేదు. ఆరు నెలల నుంచి పీఎఫ్, ఈఎస్ఐ కూడా చెల్లించడం లేదని తెలిసింది. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ప్రవేశపెట్టిన ప్రజాపాలన, స్వచ్ఛదనం-పచ్చదనం, సీనల్ వ్యాధుల నివారణ, ఇతర ప్రభుత్వ కార్యక్రమాలకు నిధుల మంజూరు లేకపోవడం గమనార్హం.

మిర్యాలగూడ పట్టణంలోని అద్దంకి- నార్కట్‌పల్లి రహదారిపై ఫ్లైఓవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి.

మిర్యాలగూడ రూపురేఖలు ఏడాదిలో మారుస్తాం

- నల్లగొండ జిల్లాను బంగారు కొండగా చేస్తాం
- పెండింగ్ ప్రాజెక్టులు అన్నింటినీ పూర్తి చేస్తాం
- లింక్ రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తాం
- రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి
- మిర్యాలగూడలో 4 ఫ్లైఓవర్ల నిర్మాణానికి భూమిపూజ

మిర్యాలగూడ, సెప్టెంబర్ 18 : నల్లగొండ జిల్లాను బంగారు కొండగా మారుస్తామని, ఏడాది కాలంలోనే మిర్యాలగూడ నియోజకవర్గం రూపురేఖలను మార్చి చూపిస్తామని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. బుధవారం మిర్యాలగూడ పట్టణంలోని వై జంక్షన్ వద్ద రూ.180కోట్లతో చేపట్టిన నాలుగు ఫ్లైవర్ బ్రిడ్జి నిర్మాణ పనులను ఎంపీ రఘువీర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ నల్లగొండ జిల్లాలోని అన్ని గ్రామాలకు రోడ్డు సౌకర్యం కల్పించడంతోపాటు లింకు రోడ్లను డబుల్ రోడ్లుగా మారుస్తామన్నారు. జిల్లాలో మొదటి విడతలోనే రూ.550 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. రోడ్లు, రవాణాకు ప్రాధాన్యం ఇస్తున్నామని, తన దృష్టికి వచ్చిన వెంటనే నిధులను మంజూరు చేస్తున్నానని తెలిపారు. మాడ్గులపల్లి మండల కేంద్రం నుంచి దామరచర్ల వరకు సర్వీస్ రోడ్డు పనులను పది, పదిహేను రోజుల్లో ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిర్యాలగూడ పట్టణంలో స్కిల్ డెవలప్‌మెంట్ శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేసేందుకు రూ.10కోట్లను మంజూరు చేయించడం జరిగిందని తెలిపారు. మిర్యాలగూడలో రూ.320 కోట్లతో అమృత్ స్కీమ్ కింద ఎస్‌టీపీ, మంచినీటి పైపులైన్ నిర్మాణాలను చేపడుతున్నట్లు చెప్పారు. యాదాద్రి థర్మల్ పవర్ ప్లాంట్‌లో ఈ డిసెంబర్ నాటికి మూడో యూనిట్‌ను ప్రారంభిస్తామని, వచ్చే ఏడాది మార్చి 31 నాటికి 4వేల మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి చేస్తామని పేర్కొన్నారు. 43 కిలోమీటర్లు పొడవు ఉన్న శ్రీశైలం సొరంగమార్గం పనులను త్వరలో పూర్తి చేసి 4 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. తద్వారా నల్లగొండ, నాగార్జున సాగర్, దేవరకొండ నియోజకవర్గాలు సస్యశ్యామలం అవుతాయన్నారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు మహబూబాబాద్, ఖమ్మం జిల్లాలోని వరదలకు గురైన వారి కోసం మిర్యాలగూడ రైస్ మిల్లర్స్ అసోసియేషన్ వారు 30 టన్నుల బియ్యాన్ని మంత్రి చేతుల మీదుగా అందజేశారు. అనంతరం క్లియో స్పోర్ట్స్ మైదానంలో జరిగిన గురుపూజోత్సవంలో మంత్రి పాల్గొని ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలను సన్మానించారు. కార్యక్రమంలో కలెక్టర్ సి.నారాయణరెడ్డి, సబ్ కలెక్టర్ అమిత్‌నారాయణ్, ఇంజనీరింగ్ చీఫ్ మధుసూదన్‌రెడ్డి, ఆర్‌అండ్‌బీ ఎస్ఈ సత్యనారాయణరెడ్డి, నల్లగొండ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు కేతావత్ శంకర్‌నాయక్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు నూకల వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

చౌటుప్పల్ మైనారిటీ గురుకులంలో నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలుపుతున్న టీచర్లు

గురుకులాల్లో సమస్యలు పరిష్కరించాలి

- నల్లబ్యాడ్జీలతో ఉపాధ్యాయుల నిరసన

రామగిరి, సెప్టెంబర్ 18 : గురుకుల విద్యాసంస్థల్లోని సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టీఎస్‌యూటీఎఫ్, గురుకుల జేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు బుధవారం ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా టీఎస్‌యూటీఎఫ్ మైనార్టీ గురుకుల విభాగం రాష్ట్ర ఉపాధ్యక్షుడు భరత్ పయ్యావుల, నాయకులు, ఉపాధ్యాయులు మాట్లాడుతూ గురుకులాల్లో విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్ చార్జీలు పెంచాలని కోరారు. అశాస్త్రీయమైన టైం టేబుల్ విద్యార్థులపై, ఉపాధ్యాయులపై ఒత్తిడి పెంచుతున్నదని పేర్కొన్నారు. మహిళా ఉపాధ్యాయులతో రోజూ రాత్రి 9గంటల వరకు పని చేయడం సరికాదన్నారు. సమస్యలు పరిష్కారించాలని, 010 పద్దు ద్వారా వేతనాలు ఇవ్వాలని, హెల్త్‌కార్డులు అందించాలని డిమాండ్ చేశారు. గురుకులాల్లో ట్యూటర్స్, కేర్ టేకర్స్, వార్డెనులను నియమించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వం సమస్యలు పరిష్కరించే వరకూ రోజు మధ్యాహ్న భోజన విరామ సమయంలో నిరసన తెలుపుతామని స్పష్టం చేశారు.

రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవర్

28న తుది ఓటరు జాబితా

- జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్‌లాల్‌పవార్
- రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం

సూర్యాపేట, సెప్టెంబర్ 18 : గ్రామపంచాయతీ ఎన్నికల కోసం రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ముసాయిదా జాబితాలో అభ్యంతరాలు ఉంటే ఈ నెల 21 వరకు పంచాయతీ కార్యదర్శుల వద్ద దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవర్ తెలిపారు. ఈ నెల 28న తుది జాబితాను విడుదల చేయనున్నట్లు చెప్పారు. బుధవారం కలెక్టరేట్‌లో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 13న రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాలతో ముసాయిదా జాబితాను విడుదల చేశామన్నారు. ఈ జాబితాను ఎంపీడీఓ ఆఫీసులు, గ్రామ పంచాయతీ కార్యాలయాల్లో ప్రచురించినట్లు తెలిపారు. జాబితాలో అభ్యంతరాలు ఉంటే పంచాయతీ కార్యదర్శుల వద్ద ఈనెల 21వరకు అందించాలని సూచించారు. 26లోగా వాటిని పరిష్కరించి, 28న తుది ఓటరు జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ఇంటింటి సర్వే నిర్వహించి ఓటరు జాబితాను సరిచేయాలన్నారు. మరణించిన వారి పేర్ల తొలగింపు, అడ్రస్ మార్పు, ఆన్‌లైన్ దరఖాస్తుల విచారణ చేసి ఐటీ టూల్స్ ద్వారా సరిచేయాలన్నారు. ఇప్పటివరకు 10,02,282 మంది ఓటర్లకు గానూ 9,14,259 ఓట్లను పరిశీలించినట్లు చెప్పారు. 91.29 శాతం ఇంటింటి సర్వే పూర్తి చేశామన్నారు. 2,001 మంది ఇతర ప్రాంతాలకు మారడం, 4,608 మంది చనపోవడం జరిగినట్లు గుర్తించామన్నారు. 1,539 మందివి జాబితాలో ఫోటోలు సరిగ్గా లేవని, ఓట్లు డబుల్ ఓట్లు 827 ఉన్నాయని పేర్కొన్నారు. జాబితాలో ఫొటో, అడ్రస్ వివరాలు క్రాస్ చెక్ చేసుకుని ఓకే కుటుంబానికి సంబంధించిన ఓట్లు ఒకే పోలింగ్ కేంద్రంలో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ నెల 19న మండల స్థాయిలో జరిగే రాజకీయ పార్టీల సమావేశానికి అందరూ హాజరై క్షేత్రస్థాయిలో జరిగే పొరపాట్లను తెలుపాలన్నారు. కార్యక్రమంలో జడ్పీ సీఈఓ అప్పారావు, డీపీఓ నారాయణరెడ్డి, ఎన్నికల విభాగం సూపరిండెంట్ శ్రీనివాసరాజు, డి సెక్షన్ సూపరిండెంట్ పద్మారావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు చకిలం రాజేశ్వరరావు, అబీద్, కోట గోపి, సత్యనారాయణ, డెవిడ్‌కుమార్ పాల్గొన్నారు.

ప్రజలను మోసం చేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం

- ఆరు గ్యారంటీల అమలులో పూర్తిగా విఫలం
- తన ప్రసంగాలతో ప్రజలను రెచ్చగొడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య

కేతేపల్లి, సెప్టెంబర్ 18 : ఎన్నికలకు ముందు ప్రజలకు మోసపూరిత హామీలతో అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, ప్రస్తుతం పరిపాలనలో పూర్తిగా విఫలమయ్యారని మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య విమర్శించారు. బుధవారం మండలంలోని కొర్లపహాడ్ గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీల పేరుతో అధికారంలోకి వచ్చి 10 నెలలు కావస్తున్నా ఇంత వరకు ఏ ఒక్క హామీని కూడా పూర్తిగా అమలు చేయలేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రజలను రెచ్చగొట్టే విధంగా మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. ప్రతిపక్షాలపై చిల్లర మాటలు మినహాయించి ఏమీ మాట్లాడాలో తెలియడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా విషజ్వరాలు ప్రబలుతుండగా.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో కనీస సౌకర్యాలు లేవన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ ఇంత వరకు పూర్తి చేయకపోవడం ప్రభుత్వం చేతగాని తనానికి నిదర్శనమన్నారు. వానకాలం పంటకాలం పూర్తికావస్తున్నప్పటికీ రైతుబంధు ఊసెత్తకపోవడం సిగ్గుచేటని మండిపడ్డారు. కౌలు రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రైతుభరోసాను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతుబీమాను కూడా కాంగ్రెస్ ప్రభుత్వం మర్చిపోయిందన్నారు. కృష్ణానది నీటి పంపకాల్లో మన రాష్ట్రానికి రావాల్సిన సాగునీటి వాటా విషయంలో ప్రభుత్వం వెనుకడుగు వేసిందన్నారు.

కేసీఆర్ పాలనలో రైతులకు రెండు పంటలకు రైతుబంధును ఇచ్చిన విషయాన్ని గుర్తు చేశారు. రెండు పంటలకు సరిపడా సాగునీటిని, ఉచిత విద్యుత్‌ను అందించిన ఘనత కేసీఆర్‌కే దక్కిందన్నారు. సమావేశంలో పార్టీ మండలాధ్యక్షుడు మారం వెంకట్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ బొప్పని స్వర్ణలతాసురేశ్, నాయకులు కొప్పుల ప్రదీప్‌రెడ్డి, కె.సైదిరెడ్డి, జి.సత్యనారాయణగౌడ్, సైదులుయాదవ్ పాల్గొన్నారు.

భూ నిర్వాసితులతో కలిసి చౌటుప్పల్ ఆర్డీవోకు వినతి పత్రం ఇస్తున్న మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల

రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్ మార్చాలి

- మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలి
- మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల, జూలకంటి
- యాదాద్రిభువనగిరి కలెక్టరేట్ వద్ద భూ నిర్వాసితులతో కలిసి ధర్నా

భువనగిరి కలెక్టరేట్/ చౌటుప్పల్, సెప్టెంబర్ 18 : చౌటుప్పల్ మండలం మీదుగా వెళ్తున్న రీజనల్ రింగ్ రోడ్డు అలైన్‌మెంట్‌ను మార్చి బాధితులకు మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని మాజీ ఎమ్మెల్యేలు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, జూలకంటి రంగారెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. చౌటుప్పల్ మండలంలో ట్రిపుల్ ఆర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న వారితో కలిసి యాదాద్రి భువనగిరి జిల్లా కలెక్టర్ కార్యాలయ వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో అలైన్‌మెంట్ మార్చి మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని ధర్నాలు చేసిన స్థానిక ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి ఇప్పుడు బాధ్యత వహించి నిర్వాసితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రీజినల్ రింగ్ రోడ్డు కోసం మిగతా చోట్ల ఔటర్ రింగ్ రోడ్డుకు 42 కిలోమీటర్ల దూరంలో భూ సేకరణ చేస్తుంటే యాదాద్రి భువనగిరి జిల్లాలో 28 కిలోమీటర్ల దూరాన్ని ఎంచుకోవడంపై అనుమానాలు వస్తున్నాయన్నారు. ఆ అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉన్నదన్నారు. చౌటుప్పల్ మండలంలో ఎకరం భూమి 2 కోట్లు, పట్టణంలో 4 కోట్లు ఉందని, పరిహారం లక్షల్లో ఇస్తే నిర్వాసిత కుటుంబాలు రోడ్డున పడుతాయని ఆవేదన వ్యక్తం చేశారు. రైతులకు భూమికి బదులు భూమి లేదా మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం కలెక్టర్ హనుమంతు కె.జెండగేకు వినతి పత్రం అందజేశారు. అంతకుముందు చౌటుప్పల్ ఆర్డీఓ కార్యాలయం వద్ద ట్రిపుల్ ఆర్ నిర్వాసితులు ధర్నా చేశారు. మాజీ ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి వారికి మద్దతు ప్రకటించి మాట్లాడారు. రైతుల పక్షాన ఎంతటి పోరాటాలకైనా సిద్ధమని ప్రకటించారు. అనంతరం ఆర్డీఓ శేఖర్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. అక్కడి నుంచి కలెక్టరేట్ వద్ద ధర్నాకు తరలివెళ్లారు. కలెక్టరేట్ వద్ద జరిగిన ఆందోళనలో తెలంగాణ రైతు సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మేక అశోక్‌రెడ్డి, మాటూరి బాలరాజుగౌడ్, రైతు ఐక్య వేదిక నాయకులు బూరుగు కృష్ణారెడ్డి, చింతల దామోదర్‌రెడ్డి, కోమటిరెడ్డి చంద్రారెడ్డి, గంగాదేవి సైదులు, బండారు నర్సింహ, ఢిల్లీ మాధవరెడ్డి, పొట్ట శ్రీను, మాజీ జడ్పీటీసీ పెద్దిటి బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ గోపగాని లక్ష్మణ్, నాయకులు సురేందర్‌రెడ్డి, శ్రీశైలం, లింగం, నర్సింహ, నిర్మల, భారతమ్మ, నిర్మల, పద్మ, బుచ్చమ్మ పాల్గొన్నారు.

ఎంజీయూలో పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు

పీహెచ్‌డీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న ప్రొఫెసర్లు

రామగిరి, సెప్టెంబర్ 18: మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిపార్టుమెంట్ ఆఫ్ కామర్స్‌లో పీహెచ్‌డీలో ప్రవేశానికి అర్హులైన అభ్యర్థులకు బుధవారం వర్సిటీలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఎంజీయూ జూన్15, 2024లో పీహెచ్‌డీలోని వివిధ కోర్సుల్లో ప్రవేశానికి ప్రవేశ పరీక్ష నిర్వహించింది. వాటి ఫలితాల ఆధారంగా ఆయా కోర్సులో అర్హత సాధించిన అభ్యర్థులల్లో కామర్స్ విభాగంలో 49 మందికి 44 మంది హాజరయ్యారు. వారికి ఇంటర్వ్యూలను డీన్, ఎంజీయూ మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి, సీనియర్ ప్రొఫెసర్ చెన్నప్ప, ఎంజీయూ కామర్స్ విభాగం అధిపతి, డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ప్రొఫెసర్స్ ఆకుల రవి, అసోసియేట్ ప్రొఫెసర్ కె.శ్రీదేవి నిర్వహించారు. ఎంపికైన వారి వివరాలు త్వరలో వెల్లడిస్తామని ఎంజీయూ డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్ ప్రొఫెసర్ ఆకుల రవి తెలిపారు.

లారీ ఢీకొని మహిళా కానిస్టేబుల్ మృతి

- కాబోయే భర్తతో సాగర్ వచ్చి వెళ్తుండగా ప్రమాదం

లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జు అయిన కారు

నందికొండ, సెప్టెంబర్ 18 : కారును లారీ ఢీకొన్న ప్రమాదంలో మహిళా కానిస్టేబుల్ మృతి చెందారు. నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌లోని హిల్‌కాలనీవద్ద బుధవారం ఈ ప్రమాదం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. గద్వాల జిల్లా కేటిదొడ్డి పోలీస్ స్టేషన్‌లో కానిస్టేబుల్‌గా పని చేస్తున్న చేపల శ్రావణి వివాహం మహబూబ్‌నగర్ జిల్లాకు చెందిన ప్రశాంత్‌తో నిశ్చయమైంది. త్వరలో వీరి వివాహం జరిపించేందుకు పెద్దలు నిర్ణయించారు. శ్రావణి, ప్రశాంత్ బుధవారం సరదాగా కారులో నాగార్జునసాగర్‌కు వచ్చారు. డ్యామ్‌ను చూసిన అనంతరం తిరుగు ప్రయాణమయ్యారు. హిల్‌కాలనీ దయ్యాలగండి సమీపంలో మూలమలుపు వద్ద ఓ లారీ.. ఫార్చునర్ కారును ఢీకొట్టింది. ఆ రెండు వాహనాల డ్రైవర్లు తమ వాహనాలను రోడ్డుపైనే నిలిపి వాగ్వాదానికి దిగారు. ముందే ఈ ప్రదేశం ఇరుగ్గా ఉండడంతో రోడ్డుపై వాహనాలు నిలిచిపోయాయి. శ్రావణి, ప్రశాంత్ కూడా తమ కారును అక్కడే నిలిపారు. అదే సమయంలో నాగార్జునసాగర్ నుంచి హైదరాబాద్ వైపునకు సిమెంట్ లోడ్‌తో అతివేగంగా వెళ్తున్న లారీ శ్రావణి, ప్రశాంత్ కారును ఢీకొట్టి ముందుకు దూసుకుపోయింది. దాంతో కారు పూర్తిగా ధ్వంసమైంది. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్న అరగంటపాటు శ్రమించి క్రేన్ సాయంతో కారులో ఇరుక్కున్న శ్రావణి, ప్రశాంత్‌ను బయటకు తీశారు. తీవ్రంగా గాయపడిన శ్రావణి (37) ప్రమాద స్థలంలోనే మృతి చెందారు. ప్రశాంత్‌ను స్థానిక కమలా నెహ్రూ ఏరియా దవాఖానకు తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ సంపత్ గౌడ్ తెలిపారు.